క్లుప్తంగా

తెలంగాణ ఏర్పడిన తర్వాతే సంక్షేమ పథకాలు అమలు

వీణవంక: రాష్ట్రంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ మవ్వురం విజయభాస్కర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని ఎల్బాకలో సోమవారం మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని, గతంలో పింఛన్ల పెంపుపై ప్రభుత్వాలు పట్టించుకోలేదని, ఇప్పుడు ఆసరా పెన్షన్ అమాంతంగా పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుస్తారని అన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఇద్దరు బాలికల తల్లి అనారోగ్యంతో మృతిచెందగా, తండ్రి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో అనాథలయ్యారు. సోమవారం గ్రామానికి చెందిన పద్మశాలి సేవా సంఘం, యువజన సంఘం, పద్మశాలి కులస్తులు రూ. 50 వేలు, అలాగే గ్రామానికి చెందిన నేచర్ యూత్ అసోసియేషన్, సింగపూర్ పీఎస్ఏ మిత్రులు రూ. 32,216, 25 కిలోల బియ్యం చిన్నారులకు అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మల్లయ్య, యువజన సంఘం అధ్యక్షులు అలువాల విష్ణు, మోర భద్రేశం, కొలిపాక కమలాకర్, మల్లేశం, సత్తయ్య, నేచర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కాసారపు పర్శారాంగౌడ్, బుర్ర శ్రీకాంత్‌గౌడ్, గడ్డం రత్నాకర్, సాగర్, రవిశాస్త్రి, మహిపాల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో సంపత్ అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ యాభై కిలోల బియ్యం స్థానిక నాయకులు ద్వారా అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపల్లి తిరుమలేశ్, సురేందర్‌రెడ్డి, అపరాధ శ్రీధర్, ఎడ్ల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు


ప్లేట్లు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని వెంకట్రావ్‌పల్లి గ్రామం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ


విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్టు హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు చెక్కులు పంపిణీ చేశారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉల్లాస్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న కేతిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి సొంత ఖర్చులతో తొమ్మిది, పదో తరగతిలో ఐదుగురు చొప్పున గతేడాది విద్యా సంవత్సరంలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చెక్కులను ప్రశాంత్‌రెడ్డి తండ్రి ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్‌రావ్, ఎస్ఎంసీ చైర్మన్, పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి


మాట్లాడుతున్న రాముయాదవ్

హుజూరాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ కోరారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారని, పథకం అమలయ్యేలా అధికారులు చొరవ తీసుకోవా లన్నారు. సమావేశంలో నాయకులు నాగ, సన్నీ, నిఖిల్, అరవింద్, విష్ణు, వంశీ, తేజ పాల్గొన్నారు.

బ్రిడ్జీలు నిర్మించినా..

- బీటీరోడ్డు లేక ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులు
- వర్షాలు కురిస్తే బురదమయం, సాగని ప్రయాణం


ఎరడపల్లివాగుపై నిర్మించిన బ్రిడ్జి (ఇన్‌సెట్లో) ఎరడపల్లి, ముత్తారం వాగుపై బ్రిడ్జి

శంకరపట్నం: మండలంలోని ఎరడపల్లి, ముత్తారం వాగులపై బ్రిడ్జీలు నిర్మించినా బీటీ రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎరడపల్లి–ముత్తారం వాగుపై ఐదేళ్ల క్రితం బ్రిడ్జి నిర్మించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ముత్తారం చెరువు నిండి మత్తడి దూకి వాగులో నీటిప్రవాహం పెరగడంతో గతంలో ఈ ప్రాంత రైతులు, ప్రయాణికుల రాకపోకలు నిలిచి ఇబ్బందులుపడ్డారు. పలుమార్లు రైతులు, ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించవించడంతో ఐదేళ్ల క్రితం బ్రిడ్జి నిర్మించారు. మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా మార్చకపోవడంతో వర్షాలు కురిస్తే ఇబ్బందులు తప్పడం లేదు. ఎరడపల్లి సమీపంలో వాగులోకి తాడికల్ నుంచి వచ్చే వరదనీటితో వానాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈక్రమంలో ఐదు నెలల క్రితం రూ.85 లక్షలతో బ్రిడ్జి నిర్మించారు. గతంలో ఉన్న రహదారిని రైతులు మూసివేయడంతో నక్షాబాట ప్రకారం వాగునుంచి రహదారి మట్టితోనే చేపట్టారు.

రైతులు, వాహనదారులు ఇక్కట్లు

ఎరడపల్లి వాగు పక్క నుంచి ఇటీవల నక్షా ప్రకారం బాటతీశారు. వర్షాకాలంలో వరద ప్రవాహంతో బాట కోతకు గురయ్యే అవకాశం ఉండడంతో అధికారులు సైడ్‌వాల్ నిర్మాణానికి రూ.50లక్షల నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాకపోవడంతో మట్టిరోడ్డే దిక్కయింది. బ్రిడ్జి నిర్మాణం చేపట్టినా రైతులు, వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు.

మూడు మండలాలకు సౌలభ్యం

ఎరడపల్లి– ముత్తారం వాగుపై బ్రిడ్జి నిర్మించారు. బీటీరోడ్డు నిర్మాణం చేపడితే శంకరపట్నం మండలం, ముత్తారం, కన్నాపూర్, రాజాపూర్, గద్దపాక, కాచాపూర్ గ్రామాలతో పాటు వీణవంక మండలం, మానకొండూర్ మండలం, కొండపల్కల, గంగిపల్లి, చెంజర్ల మీదుగా కరీంనగర్ పట్టణానికి రవాణా మార్గం సులుభమవుతుంది. దూరభారం తగ్గించే ఎరడపల్లి, ముత్తారం మట్టిరోడ్లను బీటీరోడ్లుగా మార్చాలని రైతులు కోరుతున్నారు.


ఎరడపల్లి–ముత్తారం మట్టిరోడ్డు

సైడ్‌వాల్ నిర్మించాలి



ఎరడపల్లి వాగు ప్రవాహంతో మట్టిరోడ్డు కోతకు గురికాకుండా సైడ్‌వాల్ నిర్మించాలి. రైతులు వ్యవసాయ బావుల వద్దకు రోడ్డుపై వెళ్తుంటారు. వర్షాలు కురిస్తే బురదగా మారుతోంది, వాహనాలపై వెళ్తే ప్రయాణం సాగడం లేదు.

– కనకం కుమార్, ఎరడపల్లి

ఇబ్బందులు పడుతున్నాం



ఎరడపల్లి, ముత్తారం మట్టి రోడ్డును బీటీరోడ్డుగా మారిస్తే తిప్పలు తప్పుతాయి. వర్షం కురిసినప్పుడు రైతులు, ప్రజల రాకపోకలు నిలిచి ఇబ్బందులు పడుతున్నారు. బీటీరోడ్డు నిర్మించేందుకు అధికారులు నిధులు మంజూరు చేయాలి.

– నెలవవేణి బుచ్చయ్య, ముత్తారం

ప్రతిపాదనలు పంపించాం

ఎరడపల్లి, ముత్తారం మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. సైడ్‌వాల్ నిర్మాణానికి సైతం ఎస్టిమేట్ వేశాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు చేపడతాం.

– తిరుపతి, ఏఈ, పీఆర్

ప్రజావాణిలో అధికారులపై ఫిర్యాదు

హుజూరాబాద్: హుజూరాబాద్ ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కుతాటి రాణా ప్రతాప్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ గోపికి ఫిర్యాదు చేశారు. పట్టణంలో విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేట్ పాఠశాల నడుస్తున్నా ఎంఈవో చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం శ్రీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శి అరవింద్, రవితేజ, శ్రావణ్ రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: డివిజనల్ పంచాయతీ అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కలెక్టర్ గోపికి మండలంలోని కాట్రపల్లి ఎంపీటీసీ రావుల అనిత ఫిర్యాదు చేశారు. సర్పంచ్ కాసగోని నిరోషాకిరణ్ నిధుల దుర్వినియోగం, అవినీతికి పాల్పడగా దీనిపై విచారణ జరిపిన డివిజనల్ పంచాయతీ అధికారి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

జూనియర్ కళాశాల స్థలం కాపాడాలి

చొప్పదండి: నిరుపేద విద్యార్థులకు వరంగా నిలుస్తున్న చొప్పదండి జూనియర్ కళాశాల స్థలాన్ని ఆసుపత్రికి కేటాయించడాన్ని నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు సంబోజి సునీల్ ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చొప్పదండిలో నిర్మించే వందపడకల ఆసుపత్రి నిర్మాణం కోసం కళాశాల స్థలం తీసుకొని భవనాలను కూల్చే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. భావితరాల విద్యార్థులకు ఉపయోగపడే కళాశాల స్థలంలోని భవనాలను తొలగించకుండా చూడాలని కోరారు. వేరేచోట ప్రభుత్వ స్థలంలో ఆసుపత్రి నిర్మించాలని సూచించారు. దరఖాస్తును పరిశీలిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సునీల్ తెలిపారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ


చొప్పదండి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చొప్పదండి: మండల కేంద్రంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా సోమవారం వైద్యాధికారులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మరణానంతరం నాలుగు నుంచి ఆరుగంటల లోపు నేత్రాలను సేకరించి నాలుగు రోజుల లోపు అంధత్వం ఉన్నవారికి అమర్చవచ్చని డాక్టర్ రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో జక్కుల జగన్ మోహన్, సురేశ్, హెచ్ఎం కరుణ, కృష్ణ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని వర్తక సంఘం భవనంలో యోగా శిక్షణ పొందుతున్న వారికి జాతీయ నేత్రదాన ఉత్సవాల్లో భాగంగా సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నరహరి నేత్ర దానంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అంధత్వ నివారణకు మరణానంతరం నేత్రదానంతో మరొకరికి చూపు ప్రసాదించవచ్చని, రాష్ట్రంలో సదాశయ ఫౌండేషన్ 14 ఏళ్లుగా నిర్విరామంగా కృషి చేస్తోందని, నేత్రదానం చేసేవారు ఫౌండేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అవయవదాన కార్డులు అందించారు. సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు, కార్యక్రమంలో యోగా శిక్షణ సభ్యులు పాల్గొన్నారు.


కార్డులు అందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


రామడుగు: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రామడుగు: రామడుగు–గోపాల్‌రావుపేట ప్రధాన రహదారి గుండి ఊర చెరువు వద్ద నిర్మించే బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అధికారులను కోరారు. మండలంలోని గుండి ఊర చెరువు మత్తడి వద్ద పాత బ్రిడ్జి స్థానంలో రూ. 2.15 కోట్లతో నిర్మిస్తున్న కొత్త బ్రిడ్జి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మూడు, నాలుగు మండలాలకు వెళ్లే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మానసప్రవీణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, నాయకులు తిరుపతి, మల్లేశం, కరుణాకర్, అర్జున్ పలువురు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని గంగాధర–బూర్గుపల్లి రహదారిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో రూ.నాలుగు కోట్లతో నిర్మించనున్న వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు రోడ్ల నిర్మాణ పనులకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందన్నారు. మండల కేంద్రంలో ప్రగతి మండల సమైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మ హోటల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. రాష్ట్రంలో ఎన్నో మహిళా సమైఖ్య సంఘాలు ఉన్నా మండలంలోని సంఘాల సభ్యులు ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నారని, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతంకావడం అభినందనీయమన్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ముడుపులు చెల్లించిన వారికే సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

గంగాధర: చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని టీపీసీసీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం విమర్శించారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. కప్పం కట్టు సంక్షేమ పథకాలు పట్టు అనే విధంగా నియోజకవర్గంలో అవినీతి సాగుతుందని, ముడుపులు చెల్లించిన వారికే సంక్షేమ పథకాల్లో లబ్ధి చేకూరుతుందన్నారు. ఎమ్మెల్యే సొంత గ్రామం నారాయణపూర్ రిజర్వాయర్‌తో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నా సమస్యను పరిష్కరించడం లేదన్నారు. కొండగట్టు బాధితులకు న్యాయం జరగలేదు, రామడుగు, గోపాల్‌రావుపేటలో డబుల్‌బెడ్రూం నిర్మాణాలు పూర్తి కాలేదు, చొప్పదండి లెదర్‌పార్కు జాడలేదన్నారు. అవినీతి ఎమ్మెల్యే వద్దని సొంత పార్టీ నాయకులే సీఎంకు ఫిర్యాదు చేశారని, అవినీతి అక్రమాలపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సమావేశంలో నాయకులు పద్మాకర్‌రెడ్డి, మనోహర్, శ్రీనివా స్‌రెడ్డి, తిరుపతి, రమణారెడ్డి, నారాయణ, బుచ్చ య్య, సంధ్యకరుణాకర్, శ్రీనివాస్, రమేశ్, గంగన్న, సుదర్శన్, హుస్సేన్, మహేశ్, మల్లేశం పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం

మానకొండూర్: మండలంలోని అన్నారంలో ఆదివారం అర్ధరాత్రి గొల్లపల్లి ఆంజనేయులు ద్విచక్రవాహనం దగ్ధమైంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు.. బైక్‌ను ఇంటిముందు పెట్టగా అర్ధరాత్రి పొగ రావడంతో బయటకు వచ్చి చూడగా వాహనం కాలి బూడిదైయిందని, గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం


కౌశిక్‌రెడ్డికి శ్రీసీతారామచంద్రస్వామి ప్రసాదం అందజేస్తున్న నాయకులు

వీణవంక: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి తీర్థ ప్రసాదాలను అందించి శాలువాతో సన్మానించారు. హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ తరుపున పాడి కౌశిక్ రెడ్డి గెలవాలని ఇటీవల గెల్లు శ్రీనివాస్ వీణవంక నుంచి ఇల్లందకుంట దేవస్థానం వరకు పాద యాత్ర చేశారు. హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని గెల్లు శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నేత ఈటల రాజేందర్ ప్రజల విశ్వాసం కోల్పోయాడని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మర్రి సంపత్, చరణ్, కొండాల్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా వీడ్కోలు

ఇల్లందకుంట: ఎమ్మెల్యే ప్రవాస్ యోజన్‌లో భాగంగా హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎనిమిది రోజులు పర్యటించి బీజేపీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన అస్సాం సోనారి ఎమ్మెల్యే ధరమేశ్వర్ కొన్వార్‌కు నాయకులు హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు మాట్లాడుతూ.. హుజూరాబాద్ నియోజకవర్గంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి కార్యకర్తలకు అనేక సలహాలు, సూచనలు చేశారని, రాబోయే రోజుల్లో పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ మాడగౌతమ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుప్పాల రఘు, మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకుడు ఎగ్గటి హరీశ్ ఉన్నారు.

యూఎస్‌పీసీ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లందకుంట: హైదరాబాద్‌లో సెప్టెంబర్ 1న నిర్వహించే యూఎస్‌పీసీ మహాధర్నాను విజయవంతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ పి. ఈశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీఆర్‌సీ కమిటీ వేయాలని, జూలై 1 నుంచి ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని, ఐటీ పరిమితిని పెంచాలని, పెండింగ్ డీఏలను వెంటనే విడుదలచేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో చేపట్టే ధర్నాకు ప్రాంతం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అడిట్ కమిటీ సభ్యులు సంపత్, మండల అధ్యక్షుడు వేణు, మండల టీఎస్‌సీపీఎస్‌టీయూఎస్ అధ్యక్షుడు పాన్యానాయక్, ఉపాధ్యాయులు వెంకట్రాజం, శంకర్, సత్యనారాయణ, మారుతి, స్వామి, నాగరాజు, మల్లయ్య, వీరస్వామి, పద్మ,శ్రీదేవి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కమ్యూనిటీ గ్రంథాలయం ప్రారంభం

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో సోమవారం జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) కరీంనగర్ ఎక్స్‌లెన్స్ వారి సహకారంతో రైజింగ్ సన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ గ్రంథాలయాన్ని జేసీఐ వైస్ ప్రెసిడెంట్ జేఎఫ్ఎస్ జితేందర్‌మాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రంథాలయం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైజింగ్ సన్ యూత్ క్లబ్ అధ్యక్షుడు అశోక్, సర్పంచ్ అభిషేక్‌రెడ్డి, జేసీఐ జెడ్పీ విధిగుప్తా, జెడ్‌పీపీ అభినయ్, జెడ్‌వో ఫయాజ్, కరీంనగర్ అధ్యక్షులు రాధిక, యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం


అసంపూర్తి ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

చొప్పదండి: డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నిర్లక్ష్యం చేయడం తగదని బీఎస్పీ చొప్పదండి నియోజవర్గ ఇన్‌చార్జి కొంకటి శేఖర్ అన్నారు. పట్టణ శివారులో అసంపూర్తి డబుల్ ఇళ్ల నిర్మాణాలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఐదేళ్ల క్రితం పనులు ప్రారంభించారని, ఇళ్లలో గడ్డి మొలుస్తోందని, పశువులను కట్టివేస్తున్నారని, నిరుపేదలపై చిత్తశుద్ధి లేదని ప్రజల ఆశలు ఆవిరి చేస్తున్న ఎమ్మెల్యే తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కనీసం ఇళ్ల వద్దకు రోడ్డు కూడా వేయకపోవడం శోచనీయమన్నారు. వెంట మండల అధ్యక్షుడు ఇరుగురాల రమేశ్, వడ్లూరి మహేశ్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి స్పెషల్ డ్రైవ్

జమ్మికుంట: బీఏ, బీకాం, కోర్సుల్లో ప్రవేశానికి స్పెషల్ డ్రైవ్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.రాజశేఖర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు విద్యార్థులు దఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు స్పెషల్ దోస్త్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.ఇందిరాదేవి, వైస్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీనరసింహమూర్తి సోమవారం తెలిపారు. వివరాలకు 9440020690, 9849389144 నంబర్లు సంప్రదించాలని కోరారు.

టీ–9 టికెట్ల నిలిపివేత...

హుజూరాబాద్ : రాఖీ పండుగ రద్దీ దృష్ట్యా టీ–9 టికెట్లు 29 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని సోమవారం డిపో మేనేజర్ పి. అర్పిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు.

దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతకాలి


ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే రసమయి

గన్నేరువరం: దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతకాలనేది సీఎం కేసీఆర్ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు పెంచిన పెన్షన్ రూ. 4016 సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను సోమవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం సమావేశంలో మాట్లాడారు. మానకొండూర్ నియోజజకవర్గంలో 52 వేల మందికి ఆసరా పెన్షన్ అందుతోందని, ఒంటరి మహిళ, వింతంతు, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ. 2016 పెన్షన్ అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఎన్నికలు వస్తేనే కొన్ని రాజకీయ పార్టీలకు ప్రజలు గుర్తొస్తారని అలాంటి వారిని నమ్మవద్దన్నారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సంక్షేమ పథకాలను అందిస్తున్న బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో స్వాతి, బీఆర్ఎస్ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకన్న, ఆర్ఎస్ఎస్ మండల కోఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, సర్పంచు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, లక్ష్మణ్, సుధాకర్, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలు చైతన్యం కావాలి


చిగురుమామిడిలో మాట్లాడుతున్న పచ్చిమట్ల రవీందర్

చిగురుమామిడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న బీసీ వ్యతిరేక విధానాలపై బీసీలు చైతన్యం కావాలని హుస్నాబాద్ నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని సీతారాంపూర్, గాగిరెడ్డిపల్లి, సుందరగిరి, బరిగెలోనిపల్లె, చిన్నముల్కనూర్, చిగురుమామిడి గ్రామాల్లో బీసీ చైతన్య కార్యక్రమం నిర్వహించారు. రెండు కోట్ల జనాభా ఉన్న బీసీలకు బీఆర్ఎస్ 23 ఎమ్మెల్యే సీట్లు కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. ఇప్పటికైనా బీసీలు మేల్కొనాలని కోరారు. కార్యక్రమాల్లో శంకరాచారి, విఠల్, వెంకటేశ్, మొగిలి, ఆకుల మొగిలి, చంద్రయ్య, కంది శంకర్, బోయిని రాజేశం, గందె వెంకన్న, బొందయ్య పలువురు పాల్గొన్నారు.

ఇసుక లారీ బోల్తా

మానకొండూర్: మండలంలోని పచ్చునూర్‌లో అధిక లోడ్‌తో వెళ్తున్న ఓ ఇసుక లారీ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. ఇసుక లారీ సోమవారం వీణవంక నుంచి హైదరాబాద్ బయలుదేరింది. పచ్చునూర్ సమీపానికి చేరుకోగానే వాహనం ముందుభాగంలోని రెండు చక్రాలు విరిగిపోయాయి. దీంతో అదుపుతప్పి, పక్కనున్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రమేశ్‌కు గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో శ్రీపాదుకా పీటం మహోత్సవం మంగళవారం నుంచి ప్రారంభంకానుందని అర్చకులు ఫణీంద్ర శర్మ తెలిపారు. 29 నుంచి 31వరకు మహోత్సవాలు ఉంటాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899